# చీకటి మొట్టికాయలు

## సూరంపూడి భాస్కరరావు

ఒకరోజున సీత గబగబా పరిగెత్తుకుంటూ నాదగ్గరి కొచ్చింది. ఉసిరిచెట్టుకిందకూచుని వీరేశలింగం గారి స్వీయచరిత్ర కాబోలు చదువుతున్నాను. ఉలికిపడిచూసేసరికి సీత రొజుకుంటూవచ్చి నామీద పడింది.

"రాజూరాజూ నన్నాచెట్టెక్కించు గబగబా. వాళ్లొచ్చేస్తున్నారు" అంది ఆత్రంగా.

వాళ్లెవరూ కనపళ్లేదు. ఎవరూ లేందే" అన్నాను. "కాదు వాళ్ళింకాచూళ్లేదు. కొంచె ఉంటే వచ్చేస్తారు. దబ్బునెక్కించూ" అని తొందరపెట్టేసింది. ఏం కొంపమునిగిపోతుందో అని సీతను ఉసిరిచెట్టెక్కించేశాను ఖంగారుగా. కాని ఉసిరిచెట్టుని ఆకుల్లేవు కొమ్మెక్కికూచుంది. "అయ్యో. యీ చెట్టెక్కించావేమిటి? దింపెయ్యి. అబ్బా కనపడిపోతున్నాను." అని గోలచేసింది గొంతు సన్నంచేసి.

నోరెత్తకండా దింపేశాను. కాని సీతమాత్రం నాచెయ్యి వదల్లేదు. "నడు. తొందరగా ఆ మామిడిచెట్టెక్కించు" అంటూ పరిగెత్తింది. సీతంత చరచర పరిగెత్తలేదు నేను. సీత కంగారు నాకేం తెలుస్తుంది. నేను మామిడిచెట్టు చేరేలోగా సీత మూడుమాట్లు దానిదగ్గరికెళ్ళి మళ్ళీ నాకోసం పరిగెత్తుకొచ్చింది.

సరిగ్గా నేనూ సీతను మామిడిచెట్టెక్కిస్తూండగా ఓ మూలనుంచీ రాజ్యం దౌడు తీసుకుంటూ వచ్చేస్తోంది. నేనున్నానుకదా కనుక్కుందామని కాబోలు నావేపుకే సరాసరి వచ్చేస్తోంది. రాజ్యం ఆ కొసనుండగానే సీత కనిపెట్టేసింది. "రాజూ! అలా గులాబీఅంట్లుకేసి పరిగెత్తిందని చెప్పు. లేకపోతే యిలా వచ్చేస్తుంది. వెళ్లూ" అని ముక్కింది.

నాకేం పాలుపోలే. సరి చెప్పినట్టు చెయ్యాలికాబోలునని బర్రున రాజ్యందగ్గరికెళ్లాను. "సీతేనా? ఇప్పుడే అటు పరిగెత్తింది" అన్నాను గులాబీ అంట్లవైపు చూపిస్తూను. నిజమే అనుకుని రాజ్యం వెళ్ళిపోయింది.

"ఇదేంఆట సీతా?" అని అడిగాను. "ఇప్పుడు చెప్పను. సుశీలా వాళ్లు కడుపుబ్బిందనేదాకా నేని చెట్టు దిగకూడదు. నువ్వెళ్ళిపో" అంది ఇంక నా అవసరం అప్పటి మట్టుకు తీరిపోయిందికదా అని. "నే వెళ్లిపోతే నిన్నెవరు దింపుతారు?" అన్నాను. క్షణంలో ఆలోచించి చెప్పేసింది. "అయితే దింపేసి వెళ్లిపో. నువ్విక్కడుంటే వాళ్లంతా కనుక్కుంటారు."

"దింపేస్తే నువ్వు కనపడిపోవూ?" అన్నాను.

"మరెల్లాగ?" అంది బిక్కమొగంపెట్టి.

"ఆఁ. నువ్విక్కడే ఉండు. వాళ్లకి కడుపుబ్బిందో లేదో కనుక్కుని వస్తాను" అని బయల్దేరాను. సుశీల ఒకపక్కని వెతుకుతోంది. జానకి యింకోపక్కని వెతుకుతోంది.




# ★ చీకటి మొట్టికాయలు ★

అందరు ఒక్కొక్క చెట్టుకే ప్రదక్షిణం చేసుకుంటూ వొస్తున్నారు. అంతపెద్దచెట్టెక్కి కొమ్మల్లో రెమ్మల్లో గువ్వపిట్టలా కూచుంటుందని వాళ్లెలా అనుకుంటారు? రాజ్యం, సుందరి వెతకలేక వెనక్కొచ్చేశారు. సుశీలా జానకీకూడా వెతకడం చాలించేశారు. "ఎక్కడ దాక్కుంది చెప్మా" అంది సుందరి బాదంఆకు తుంపుతూను. "ఇంటికెళ్లిపోయిందికాబోలే"అంది జానకి. "అయితే కడుపుబ్బినట్టేనా?" అన్నాను నేను. "ఆఁ. ఇట్టే పట్టుకుంటాం దొంగనిచూసుకో."అన్నారంతా ఒక్కసారి. "రాజే దాచాడే ముక్కడోను. టక్కరిచూపు లెలా చూస్తాడో చూడు." అంది ఆపలించకముందే పేగులు లెక్కపెట్టే రాజ్యం. "ఎక్కడ దాచావో చెప్తావా చెప్పవా?" అని గద్దించింది సుశీల పట్టపురాణిలా కీవిగా. అంతా నన్ను ముట్టడించేశారు.

వీళ్లకి రహస్యం బయటపెట్టడానికి మార్గ మెల్లాగో నాకు బోధపడలేదు. "సీత దాక్కున్నచోటు నేను చెప్తానుగాని, నేను చెప్పానని సీతకి చెప్పకండేం?" అని "కానీ మీరంతా ఒక పని చెయ్యాలి. ఆ మామిడిచెట్టు దగ్గిర ఒక చింత ముక్క ఉంది. ఆ ముక్కకి మొదట్లో ఒక చిన్న కాగితంముక్క పెట్టాను. అది చదువుకున్న వాళ్లకి సీత యెక్కడ దాక్కుందో తెలిసిపోతుంది" అన్నాను. "ఏమీ చప్పుడు చేయకుండా వెళ్లాలి సుమా" అని హెచ్చరిక చేశాను. సీత మామిడాకులు నములోంది. వీళ్ళందరికీ కాగితంకోసం వెతుకులాటేగాని చెట్టుమీదకి దృష్టి మళ్లితేగా.

పాపం వాళ్లంతా వెళ్ళి ఊ, వెతుకున్నారు. చింత ముక్కలెన్నైనా ఉన్నాయిగాని కాగితం ముక్క ఉంటేగా. చింకి కాగితం ముక్కలు ఉన్నా వాటిలో చదివేందుకేముందిగనక. నేనుకూడా వెళ్ళి చెట్టుకింద కూలబడ్డాను. "అసలు సీత ఎందుకుదాక్కుంది రాజ్యం?" అన్నాను.

దాగుడుమూతల్లో దొంగై మూడుసార్లు ఎవర్నీ ఔటుచెయ్యలేకపోయింది. చీకటి మొట్టికాయలకి తల్లిదగ్గరకూర్చున్నట్టేకూర్చుని ఒక్కగంతున లేచిపోయింది. "కూవోవేం?" అంటేను, "నేను ఒకచోట దాక్కుంటాను, నను మీరు వెతుక్కుంటే అప్పుడు చీకటి మొట్టికాయలు తింటాను" అంది. మరి "ఎంతమంచిచోటు జ్ఞాపకం వచ్చిందో!"అని రాజ్యం ఆలోచనలోపడ్డట్టు చూసింది. మిగతా వాళ్లంతా చింతముక్కదగ్గిర కాగితమే సీత అన్నట్టుగా వెతుకుతున్నారు. 'ఓహో అదాసంగతీ— పోనీలే ఎక్కడదాక్కుంటే మనకేం గాని, అంతావచ్చి కూర్చోండి కబుర్లుచెప్పుకుందాం' అన్నాను. "కాగితంలేదు, ఏంలేదు. అన్నీ అబద్ధాలే" అంది ఉడుకుమోతు పిల్ల జానకి. "అబద్ధాలా? ఈ చెట్టుమీదే కోకిలుంటేనా దాని చేత చెప్పిద్దును సీత దాక్కున్నచోటు నాకు తెలుసుకో తెలియదో." అన్నాను నేను.

"మరే కూర్చున్నాయి కోకిలలు సీతో కబుర్లు చెప్పడానికి" అంది సిసింద్రీలా సుశీల. నేను సత్యవచనున్ని వీళ్ళందరిదగ్గరా బుజావు చేసుకోడం ఎల్లాగా అని ఆలోచించాను. "కోకిలా, నువు చెట్టుమీదున్నావో లేదోగాని ఉంటే నే నడిగిందానికి జవాబు చెప్పు" అన్నాను. 'కూ' అంది కోకిల్లాగ సీత. 'అమ్మ దొంగా! ఇక్కడున్నావా?' అని అంతా ఒక్కసారి పైకిచూచారు. ఆపుకోలేక సీత ఫక్కున నవ్వింది విజయగర్వంతో. ఆ నవ్వుకి చేతులు పట్టుజారిపోయినందుకు గబుక్కున నేను పట్టుకున్నాను గనక సరిపోయింది గాని లేకపోతే అవును అమ్మగారి పెళ్ళి. చీకటి మొట్టికాయలు తప్పినా తల బొప్పికట్టటం తప్పకపో యేది. ★

